సాక్షి
కర్నూలు
మంగళవారం ; 9 ; జూలై ; 2024



రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన చింత శ్రీనివాసరావు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళావేదికపై పశ్చిమగోదావరికి చెందిన ఉమామహేశ్వర నృత్య కళాక్షేత్రం బృందం ప్రదర్శించిన నృత్యం అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,601
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 23
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 30,388
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 156

న్యూస్‌రీల్

ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాల్సిందే

- సెట్ కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ హెచ్చరిక

కర్నూలు: క్రైం పార్టీ అయినా, కంప్యూటర్ విధులు నిర్వహిస్తున్న వారైనా.. ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాల్సిందేనని జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ సెట్ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. 'బదిలీలు తప్పవని.. వసూళ్లు తప్పేంటనే' శీర్షికన ఈ నెల 5న 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఎస్పీ తీవ్రంగా స్పందించారు. క్రైం పార్టీ పేరుతో మఫ్టీలో తిరగడం ఇకపై కుదరదని హెచ్చరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్నూలు అర్బన్ తాలుకా పోలీస్ స్టేషన్‌లో క్రైం పార్టీ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరుపై ఫిర్యాదుల నేపథ్యంలో సెట్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన స్పష్టమైన సంకేతాలను ఇచ్చారు. అలాగే జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి కూడా పలు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. తమకు అందిన ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

పెరుగుతున్న పత్తిసాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పత్తి సాగు పెరుగుతోంది. ఇప్పటి వరకు ఖరీఫ్‌లో 1,21,995 హెక్టార్లలో వివిధ పంటలు సాగు కాగా.. అందులో 82,279 హెక్టార్లలో రైతులు పత్తి విత్తనం వేశారు. మిగిలిన పంటలన్నీ కలిపి 39,716 హెక్టార్లకు పరిమితమయ్యాయి. వేరుశనగ 15,457, కంది 11,341, ఆముదం 2181, మిరప 879, ఉల్లి 2691, సజ్జ 2345, మొక్కజొన్న 2193, కొర్ర 1,688 హెక్టార్ల ప్రకారం సాగయ్యాయి. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ. ఉండగా, ఇప్పటి వరకు 6.9 మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. రెండు వారాలకుపైగా సరైన వర్షాలు లేవు. రానున్న నాలుగైదు రోజుల్లో వర్షాలు పడితేనే వ్యవసాయం ఆశాజనకంగా ఉంటుంది.

కుష్ఠు వ్యాధిపై 18 నుంచి సర్వే



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ

కర్నూలు(సెంట్రల్): కుష్ఠు వ్యాధిపై 1,630 బృందాలతో జూలై 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన పోస్టర్లను కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య, వైద్యాధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి మైక్రో బ్యాక్టీరియా లెప్రి అనేసూక్ష్మ క్రిమితో వస్తుందని, వ్యాధిని త్వరగా గుర్తిస్తే ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందకుండా అరికట్టేందుకు అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధికి సంబంధించిన ఎండీటీ మందులు ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిగా ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.మధుసూదన్‌రావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా కుష్ఠు ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ భాస్కర్, జిల్లా న్యూక్లియస్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, డీసీఎంఓలు హక్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



మంత్రాలయంలో వైఎస్సార్‌కు జోహార్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కర్నూలు మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



వెల్దుర్తిలో వైఎస్సార్ విగ్రహానికి నమస్కరిస్తున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



సి.బెళగల్‌లో పార్టీ నేతలు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ తదితరులు

మహానేతా.. మనసాస్మరామి!

- జిల్లాలో ఘనంగా వైఎస్సార్ జయంతి
- దివంగత నేత విగ్రహాలకు పాలాభిషేకాలు
- ర్యాలీలు నిర్వహించిన అభిమానులు
- కేకులు కట్ చేసి నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నేతలు

కర్నూలు (టౌన్): ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలందరికీ ఇళ్లు..ఇలా అనేక పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిని సోమవారం మనసారా స్మరించుకున్నారు. వైఎస్సార్ జయంతిని ఊరూవాడా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణాల్లో ర్యాలీలు నిర్వహించి జోహార్.. వైఎస్ఆర్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పల్లెల్లో మహానేత విగ్రహాలకు పాలాభిషేకాలు చేశారు. కేకులు కట్ చేసి, మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సుపరిపాలనను వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి పేద ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించిన మహనీయుడని కొనియడారు. ఫీజురీయింబర్స్‌మెంట్ ఇచ్చి పేద విద్యార్థుల ఉన్నతవిద్యకు బాటలు వేశారన్నారు. జలయజ్ఞంతో నూతన సాగునీటి ప్రాజెక్టులు చేపట్టి, రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. తండ్రి వైఎస్సార్ బాటలో తనయుడు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పయనిస్తున్నారన్నారు. తన ఐదేళ్ల పాలనా కాలంలో ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు.



కల్లూరు శరీన్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ

- ➡ కర్నూలులో ఎస్‌బీఐ సర్కిల్ వద్ద ఉన్న మహానేత కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కర్నూలు పార్లమెంటరీ డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్ ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు.
- ➡ మంత్రాలయంలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సేవలను కొనియాడారు. తండ్రి బాటలోనే తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారన్నారు. రాజన్న అభిమానాన్ని ఎవరూ చెరిపేయలేరన్నారు.
- ➡ ఆదోని పట్టణంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి గోషాసుపత్రి రోడ్డులో ఉన్న మహానేత విగ్రహం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి జలాభిషేకం చేసి, నివాళులర్పించారు ఎమ్మెల్సీ డాక్టర్ మదుసూధన్, పార్టీ నేతలు పాల్గొన్నారు.
- ➡ కల్లూరు అర్బన్ పరిధిలోని శరీన్‌నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- ➡ పత్తికొండ నియోజకవర్గంలోని వెల్దుర్తిలో పాత బస్టాండ్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నివాళులర్పించారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని పార్టీ నాయకుడు పోచమిరెడ్డి మురళీధర్ రెడ్డి మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.
- ➡ కోడుమూరు నియోజకవర్గంలోని సీ.బెళగల్ మండలం, గుడూరు మండలాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ పాల్గొని కేక్ కట్ చేశారు.

రన్ వే విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో రన్‌వే విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయన ఎయిర్‌పోర్టు నుంచి ఎక్కడెక్కడికి విమానాలు ఏఏ రోజుల్లో వెళ్తాయి? ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారనే విషయాలను ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విమానాలు రాత్రి వేళల్లో ల్యాండింగ్ అయ్యేందుకు అనువుగా రన్‌వే విస్తరణ చేయాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదలను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో కె.మధుసూధన్‌రావు, కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి, ఓర్వకల్లు తహసీల్దార్ నటరాజు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతో ఊళ్లోకి రానివ్వడం లేదు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు

కర్నూలు: రాజకీయ కక్షతో తమ కుటుంబాన్ని ఊళ్లోకి రానివ్వకుండా టీడీపీ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రక్షణ కల్పించాల్సిందిగా వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన తన్నీరు లలిత జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గిరినాథ్‌చౌదరిని ప్రత్యర్థులు హత్య చేస్తే తాము వైఎస్సార్‌సీపీకి అండగా ఉన్నామనే అక్కసుతో తమపై పగ పెంచుకొని హతుని కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. తమకు రక్షణ కల్పించి ఊరిలో ఉన్న సామాన్లు కర్నూలుకు తెచ్చుకునేందుకు వెల్దుర్తి పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని ఆమె వినతి పత్రంలో కోరారు. స్థానిక 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 75 మంది ఫిర్యాదుదారులు ఎస్పీని కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. వాటన్నింటిపై చట్టపరిధిలో విచారణ జరిపి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డీఎస్పీ బాబుప్రసాద్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐ శివశంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ఫిర్యాదుల్లో కొన్ని ...

- ➡ హైదరాబాద్‌లో తక్కువ రేటుకు బంగారం ఇప్పిస్తామని చెప్పి రూ.1.90 లక్షలు తీసుకొని అశోక్ అనే వ్యక్తి మోసం చేశారని, ఈ సంఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని మంత్రాలయం మండలానికి చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.
- ➡ చీటీల పేరుతో తన వద్ద నుంచి రూ.7 లక్షలు వసూలు చేసి చీటీ కాల పరిమితి అయిపోయిన తరువాత డబ్బులు ఇవ్వకుండా చిత్రాల సాయిబాబా అనే వ్యక్తి పరారయ్యారని, న్యాయం చేయాలని పెద్దపాడు గ్రామానికి చెందిన అశోక్ కోరారు.
- ➡ దిన్నెదేవరపాడు వద్ద శ్రీ లక్ష్మి వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ హౌసింగ్ పేరుతో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి బిల్డర్లు నాగేంద్రుడు, సోమయ్యాచారి మోసం చేశారని కోడుమూరుకు చెందిన అరుణ ఫిర్యాదు చేశారు.
- ➡ ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.15 లక్షలు తీసుకొని ఒక వ్యక్తి మోసం చేశారని కర్నూలు సీతారామనగర్‌కు చెందిన ఫిర్యాదు చేశారు.
- ➡ కర్నూలు ఎస్‌బీఐలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ప్యాపిలికి చెందిన దీపు, మనోజ్ అనే వ్యక్తులు మోసం చేశారని, న్యాయం చేయాలని కర్నూలు సీ క్యాంప్‌కు చెందిన అచ్చెన్న కోరారు.
- ➡ వారసత్వంగా తండ్రి ద్వారా వచ్చిన నూతన పల్లె గ్రామ శివారుల్లోని 2.50 ఎకరాల పొలాన్ని గొల్ల జయమ్మ కౌలుకు తీసుకొని ఆక్రమించుకోవాలని బెదిరింపులకు పాల్పడుతోందని సూదిరెడ్డి పల్లెకు చెందిన అక్కాచెల్లెళ్లు సరస్వతమ్మ, సరోజ, చిట్టెమ్మ ఫిర్యాదు చేశారు.

చంద్రన్న బీమా క్లైమ్‌ల రిజిస్ట్రేషన్

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది జూన్ 30 వరకు జరిగిన ప్రమాద మరణాలు, సజ మరణాల వివరాలను చంద్రన్న బీమా కింద రిజిస్ట్రేషన్ చేసి, ప్లోడ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వైఎస్ఆర్ బీమాను కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమాగా మార్పు చేసింది. ఎన్నికల సమయంలో ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు, హజ మరణాలకు రూ.5 లక్షలు పరిహారంగా ఇస్తామని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇవ్వలేదు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో మార్చి 16న వెబ్‌సైట్‌ను మూసేశారు. తాజాగా వైబ్‌సైట్ ఓపన్ చేసి క్లెమ్‌లు రిజిస్టర్ చేసేందుకు, అప్‌లోడ్ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు, వార్డు డెవలప్‌మెంట్ సెక్రటరీలకు లాగిన్ ఇచ్చారని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు.

చూద్దాం.. చేద్దాం!

- తూతూ మంత్రంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- ఆస్తి కోసం చంపాలని చూస్తున్నారని వృద్ధురాలి ఫిర్యాదు
- బాధితురాలికి అందని భరోసా
- కోకొల్లలుగా వస్తున్న సమస్యలు.. స్పందన అంతంత మాత్రమే

కర్నూలు(సెంట్రల్): నూతన ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తూతూ మంత్రంగా సాగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలకు 'చూద్దాం.. చేద్దాం' అనే సమాధానమే వినిపోస్తోంది. బాధితులకు పూర్తిస్థాయిలో భరోసా అందడం లేదు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అర్జీలు వందల సంఖ్యలో వస్తున్నాయి. పరిష్కార స్పందన అంతంతమాత్రంగానే ఉంటోంది. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదన్‌రావు ప్రజల నుంచి వితనులు స్వీకరించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడం లేదు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

వినతుల్లో కొన్ని...

- ➡ అమ్మా నాన్నలు వెంకటమ్మ, లక్ష్మీకాంత్ ఇద్దరూ మృతి చెందారని, తాము అనాథలం అయ్యామని,అరికెర అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదివేందుకు సీట్లు ఇప్పించాలని ఆదోని మండలం కపటి గ్రామానికి భువనేశ్వరి, మల్లేశ్వరి అనే బాలికలు కలెక్టర్‌కు విన్నవించారు.
- ➡ తాము 20 ఏళ్ల నుంచి పోడు భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నామని, దానికి పట్టా ఇప్పించాలని ఓర్వకల్ మండలం నన్నూరుకు చెందిన చంద్రమ్మ కోరారు.
- ➡ నీట్ పేపర్ లీకేజీపై సీఎం చంద్రబాబునాయుడు స్పందించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్ డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు.
- ➡ తన తండ్రికి 1982లో సర్వే నంబర్ 19/1,336, 337లో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చారని, అందులో తాము ఇల్లు కట్టుకోవాలని బేస్మట్టం వేసిన తరువాత 2021లో అప్పటి సబ్‌రిజిస్ట్రార్ ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేకున్నా అక్రమార్కుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని, ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి న్యాయం చేయాలని కర్నూలుకు చెందిన అన్నయ్య అర్జీ ఇచ్చారు.
- ➡ ఓర్వకల్లు మండలం నన్నూరుకు చెందిన కొందరు రైతులు 70 ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్నారని, అనుభవం ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం నాయకుడు జి.రామకృష్ణ వినతిపత్రం ఇచ్చారు.
- ➡ సంక్షేమ హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న వర్కర్‌పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప వినతిపత్రం ఇచ్చారు.
- ➡ 2023 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు అర్జీ ఇచ్చారు.
- ➡ ఎస్సీ, ఎస్టీ మహిళావార్డెన్లను వేధించిన సస్పెండైన ఏబీసీడబ్ల్యూ లక్ష్మీనారాయణపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడురాగిరి చంద్రప్ప కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ చిత్రంలో వీల్‌చైర్‌లో ఉన్న ఈమె పేరు లక్ష్మమ్మ. కోడుమూరు మండలం గోరంట్ల గ్రామానికి చెందిన ఈమె తన కుమారుడు మాధవస్వామిని వెంటబెట్టుకుని సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ఆస్తికోసం కుమారులు, కోడళ్లు తనను, తన కుమారుడిని చంపాలని చూస్తున్నారని, రక్షణ కల్పించాలని అర్జీ పట్టుకుని ఉండగా.. కోడుమూరు ఎస్ఐని కలవాలని, అక్కడ పని కాకపోతే వచ్చే సోమవారం రావాలని ఇక్కడున్న పోలీసులు చెప్పారు. అయితే ఆమె ప్రాధేయపడటంతో కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. తనకు 90 ఏళ్ల ఉంటుందని, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని ఆమె తెలిపారు. ఒక కుమారుడు శ్రీరాములు గోనెగండ్లలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారని. ఒక కుమారుడు మాధవస్వామి తన వద్ద ఉన్నాడని, మిగిలిన ఇద్దరు ఊర్లోనే వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. తన భర్త చనిపోయిన తరువాత 23 ఎకరాల పొలాన్ని నలుగురు కుమారులకు సమానంగా పంచానని, ప్రస్తుతం మా వద్ద ఉన్న ఆస్తిని కాజేసేందుకు మిగిలిన ముగ్గరు కుమారులు చూస్తున్నారని, ఇంట్లోనే ప్రాణ భయం ఉందని, రక్షణ కల్పించాలని అర్జీలో పేర్కొన్నారు. గతంలో కూతురు, అల్లుడు కొన్నాళ్లు ఇంట్లో ఉండి రూ.6.50 లక్షల నగదు, 20 తులాల బంగారు దొంగిలించి తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం ఇచ్చిన తర్వాత చూద్దాం.. చేద్దాం అన్న మాట తప్ప బాధితురాలికి ఎలాంటి భరోసా లభించకపోవడంతో ఆమె నిరాశతో వెనుదిరిగారు.



కట్టి పట్టుకుని కలెక్టరేట్‌కు వచ్చిన ఈ వృద్ధుడి పేరు బడేసాహెబ్, సీ బెళగల్ మండలం గుండ్రేవులకు చెందిన ఈయనకు రెండు ఇళ్లు ఉన్నాయి.



అలాగే తాండ్రపాడులో 6 సెంట్ల స్థలం ఉంది. ప్రస్తుతం ఈయన వయస్సు 80 ఏళ్లకుపైగా ఉంటుంది. భార్య మృతి చెందడంతో సొంతంగా అన్నం వండుకొని తినేస్థితి లేదు. కుమార్తె ఉన్నా పట్టించుకోవడం లేదు. ఆస్తిని కుమార్తెకే ఇస్తానని, తన బాగోగులు చూసుకునేలా చర్యలు తీసుకోవాలని ఈయన కలెక్టర్‌కు విన్నవించారు.

కదలికలు లేని కుమార్తె అస్మత్‌బేగం(10)తో ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన తండ్రి చాంద్‌బాషా సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. కుమార్తెను బాగు చేయించుకోవడం కోసం తిరగని ఆసుపత్రులు లేదంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ప్రస్తుతం ఈ పాప మంచానికే పరిమితమైందని, పింఛన్ రూ.6 వేలు మాత్రమే వస్తోందని, అది పోషణకు ఏ మాత్రం సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ రూ.15 వేలకు పెంచాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



ఈయన పేరు షేక్ ఇస్మాయిల్ మియ్యా. కర్నూలులోని గడ్డా వీధికి చెందిన ఈయన నడవలేరు. దోక్కుంటూ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. తాను ఏ పనిచేయలేనని, పింఛన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ కోసం తిరుగుతుంటే అధికారులు పట్టించుకోవడంలేదని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.



క్లుప్తంగా

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధకశాఖ ద్వారా సన్న జీవాలు, తెల్లజాతి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం కర్నూలు, నంద్యాల జిల్లాలో మొదలైంది. గొర్రెలు, మేకల్లో చిటుకు వ్యాధి, నీలి నాలుక, తెల్ల జాతి పశువుల్లో ముద్ద చర్మపు వ్యాధి(లంపీస్కిన్ డిసీజ్) నివారణకు టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు తెలిపారు. తెల్లజాతి పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి నివారణ కోసం కర్నూలు జిల్లాకు 2,34,800 , నంద్యాల జిల్లాకు 1,12,900 డోసుల ప్రకారం వ్యాక్సిన్ వచ్చిందన్నారు. దీనిని రెండు జిల్లాలకు సరఫరా చేసినట్లు చెప్పారు. చిటుకు వ్యాధి నివారణ టీకా కర్నూలు జిల్లాకు 12,73,500, నంద్యాల జిల్లాకు 10,49,500 డోసులు సరఫరా చేసినట్లు డాక్టర్ రవిబాబు పేర్కొన్నారు. నీలి నాలుక(బ్లూటంగ్) వ్యాధి నివారణకు కర్నూలు జిల్లాకు 13,15,250, నంద్యాల జిల్లాకు 8.71 లక్షల డోసుల వ్యాక్సిన్ సరఫరా అయిందని తెలిపారు. నెల రోజుల పాటు టీకాలు వేసే కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య



వృద్ధుడి మృతదేహం

ఆళ్లగడ్డ: అహోబిలం అడవిలో ఓ గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆళ్లగడ్డ నుంచి అహోబిలం వెళ్లే ప్రధాన రహదారి నుంచి గండ్లేరు రిజర్వాయర్ వెళ్లే దారి పక్కన అడవిలో ఓ వృద్ధుడు విగతజీవిగా పడి ఉన్నట్లు గమనించిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కిడికి వెళ్లి పరిశీలించారు. సమీపంలో పురుగు మందు డబ్బా ఉండటంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరసింహులు తెలిపారు.

పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పుట్టుకతో వచ్చే లోపాలను సకాలంలో గుర్తించాలని, లేకపోతే పిల్లలు జీవితాంతం వైకల్యాలను ఎదుర్కోవాల్సి వస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చరర్ గ్యాలరీలో పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, స్టాఫ్‌నర్సులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో వచ్చే వినికిడి లోపంతో పిల్లలు మూగవారిగా ఉండిపోతారని, ఇలాంటి వారిని సకాలంలో వైద్య సహాయం అందిస్తే మాట్లాడగలుగుతారన్నారు. కంటి శుక్లాలు, చిన్నతనంలో వచ్చే పక్షవాతం తదితర సమస్యలను నయం చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఆదోని ఏరియా ఆసుపత్రిలో సత్వర చికిత్సా కేంద్రాలు ఉన్నాయని, వీటికి పంపిస్తే వెంటనే వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ కేంద్రాల్లో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. పుట్టుక నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో వచ్చే వ్యాధులు, లోపాల గురించి వైద్యాధికారి డాక్టర్ సృజన ఎల్‌సీడీ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



మత్తు వదలరా.. ‘సమస్య’గా మిగిలిపోకురా!

ప్రతి ఇంట్లో కుంపటి ఉన్నట్లుగానే.. అందరి జీవితాల్లో ఏదో ఒక సమస్య ఉండటం సహజం. అంత మాత్రాన తనువు చాలించాలనుకోవడం, తాగుడుకు బానిస కావడం.. లోకంలో తానొక్కడే బాధ పడుతున్నట్లుగా సమాజానికి, కుటుంబానికి దూరమవడం పరిపాటిగా మారింది. ఈ ఫొటోలోని వ్యక్తి వయస్సు సుమారు 30 ఏళ్లు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో నగరంలోని గణేష్‌నగర్ సుద్దవాగు సమీపంలో ఇలా చెత్తాచెదారం మధ్య తాగిన మైకం తలకెక్కి నిద్ర మత్తులోకి జారుకున్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన వాళ్లు ఎవరైనా తల్లిదండ్రులకు చెబితే కన్న పాపానికి వాళ్లు ఎలా తలెత్తుకుని బతకగలరు. ఒకవేళ పెళ్లయింటే.. ఇతడినే నమ్ముకుని ఏడడుగులు నడిచిన, మూడు ముళ్ల బంధంతో ఆ ఇంట్లో అడుగు పెట్టిన ఇల్లాలి పరిస్థితి ఏమిటి? పిల్లలు ఉన్నట్లయితే.. మీ నాన్న ఇలా తాగి ఎక్కడంటే అక్కడ పడిపోతాడంట కదా? అని స్నేహితులు ప్రశ్నిస్తే ఆ లేత మనసులు జీర్ణించుకోగలవా? ఒక్క నిముషం ఆలోచించండి.. ఆ కాలకూట విషం గొంతు దిగక మునుపే మిమ్మల్నే నమ్ముకున్న కుటుంబాన్ని గుర్తు చేసుకోండి.. సమస్యకు కొత్త సమస్యను తోడు చేసుకోకుండా పరిష్కారం దిశగా అడుగులు వేసినప్పుడే మనిషి పుట్టుకకు సార్థకత చేకూరుతుందని గ్రహించండి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఉరిస్తున్న ప్రవాహాలు!

- కృష్ణ, తుంగభద్ర జలాలే ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన సాగునీటి వనరులు
- ఈ జలాల పైనే 7.26 లక్షల ఎకరాల ఆయకట్టు ఆధారం
- రూ.19.4 కోట్ల అంచనాలకు లభించని ఆమోదం!

కర్నూలు సిటీ: ఉమ్మడి కర్నూలు జిల్లాకు కృష్ణ, తుంగభద్ర నదులే ప్రధాన జల వనరులు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఈ రెండు నదుల్లో ప్రవాహం ఆశాజనకంగా కొనసాగుతోంది. కృష్ణా బేసిన్‌లో ప్రధానం అల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులు ఉన్నాయి. ఆ బేసిన్‌లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుల్లోకి నీటి చేరికలు పెరిగాయి. అల్మట్టి ప్రాజెక్టులోకి ప్రస్తుతం 60,603 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. మరి కొద్ది రోజుల్లో ఈ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సెంట్రల్ వాటర్ కమిషన్ అంచనా వేస్తోంది. అల్మట్టి నిండిన తరువాతే దిగువన ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్‌కు కృష్ణమ్మ రానుంది. అదే విధంగా కృష్ణా సబ్ బేసిన్ అయిన తుంగభద్ర నదిలో సైతం నీటి ప్రవాహం రెండు రోజులకు ఒకసారి హెచ్చు, తగ్గులుగా ఉంటోంది. రెండు రోజుల క్రితం 50 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, సోమవారం నాటికి అది 30 వేల క్యూసెక్కులకు తగ్గింది. కృష్ణా బేసిన్, సబ్ బేసిన్‌లో నీటి ప్రవాహంపైనే ఉమ్మడి జిల్లా ఆయకట్టుదారుల ఆశలు పెట్టుకున్నారు. కొంత నీటి లభ్యత ఉన్న చోట రైతులు వరి సాగుకు నారు పెంచుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు చూస్తుంటే ప్రతి రోజు మేఘావృతం అవుతుంది. కానీ వర్షాలు మాత్రం రావడం లేదు. ఇప్పుడున్న పరిస్థితులను బట్టి ఈ నెల చివరిలోపు మంచి వర్షాలు వస్తే ప్రాజెక్టులకు నీరు వస్తుందని జల వనరుల శాఖ ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు.

7.26 లక్షల ఎకరాల ఆయకట్టు

ఉమ్మడి జిల్లాలో కర్నూలు–కడప కాల్వ, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, సిద్ధాపురం ఎత్తిపోతల పథకం, వరదరాజుల స్వామి ప్రాజెక్టు, తుంగభద్ర దిగువ కాలువ, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు, పులికనుమ రిజర్వాయర్, పులకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు ఆంధ్రప్రదేశ్ ఆయకట్టు అభివృద్ధి సంస్థ పథకాల కింద 7.26 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టుకు సాగు నీరు అందించాలంటే శ్రీశైలం ప్రాజెక్టుల్లో 215 టీఎంసీల నీరు ఉండాలి. ప్రస్తుతం 885 అడుగులకు గాను, 813 అడుగుల నీటి మట్టం, 36.66 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. అదే విధంగా తుంగభద్ర డ్యాంలో 105 టీఎంసీల నీటి సామర్థ్యం ఉండి, డ్యాం నుంచి దిగువన ఉన్న నదిలోకి నీటి విడుదల కొనసాగుతూ ఉండాలి. ఈ డ్యాంలో 40 టీఎంసీలకు పైగా నీరు చేరిన తరువాత సాగునీటి కాలువలకు నీటిని విడుదల చేస్తారు. ఎగువ నుంచి డ్యాంలోకి నీటి ప్రవాహం ఆశాజనకంగా ఉంటేనే నీటిని విడుదల చేస్తారు. ప్రస్తుతం 21 టీఎంసీలు నీరు ఉండగా, ఇన్‌ఫ్లో 30 వేల క్యుసెక్కులు ఉంది. తుంగభద్ర జలాల్లో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకు 27.4 టీఎంసీల నీటిని ఇటీవలే టీబీ బోర్డు స్థాయి పర్యవేక్షక ఇంజినీర్ల సమావేశంలో కేటాయించారు.

అత్యవసర పనులకు 19.50 కోట్లతో అంచనాలు

ఉమ్మడి జిల్లాలోని ఖరీఫ్‌లో సాగు నీటిని అందించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల్లో అత్యవసరమైన పనులు చేసేందుకు రూ.19.50 కోట్లతో జల వనరుల శాఖ ఇంజినీర్లు అంచనాలు వేశారు. గత నెల 19వ తేదీన రూ.70.37 కోట్లతో ఈ పనులకు ఇంజినీర్లు అంచనాలు వేసి, మంత్రి దగ్గర ఆ ప్రతిపాదనలు తీసుకొని వెళ్లగా, అంత బడ్జెట్ కష్టం అంటూ.. ఇందులో 10 శాతంలోపే అంచనాలను తగ్గించాలని మంత్రి సూచించారు. దీంతో రూ.4.05 కోట్లకు తగ్గించి, తాజాగా రూ.19.50 కోట్లతో అంచనాలు వేశారు. అయితే ఈ అంచనాలకు సైతం నిధుల కొరత ఉందని ఆమోదం తెలపడం లేదని తెలుస్తోంది.

సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించం

- హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు



జ్యోతి ప్రజ్వలనతో సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదని విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి హెచ్చరించారు. శ్రీ లలితా పీఠం ఆధ్వర్యంలో సోమవారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో నాల్గవ హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ.. విపక్ష నేత రాహుల్ గాంధీ పవిత్రమైన పార్లమెంట్ సాక్షిగా హైందవ సంస్కృతిని కించపరిచేలా మాట్లాడటం గర్హనీయమన్నారు. వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారి మఠం అచలానంద ఆశ్రమం స్వామీజీ విరజానంద ప్రసంగిస్తూ.. హిందువులందరూ హైందవ విలువలతో జీవించటం అత్యంత అవసరమన్నారు. ప్రధాన వక్త వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలను ఆచరించడం, గౌరవించడం మనందరి కర్తవ్యం కావాలన్నారు. కందిమల్లాయపల్లె బ్రహ్మంగారి మఠం వీరబ్రహ్మేంద్ర స్వామి 8వ తరం ముని మనుమడు నొస్సం వీరంభట్లయ్య స్వామి, చిన్నటేకూరు సద్గురు నాగలింగేశ్వర జీవైక్య మఠం మఠాధిపతి ఎల్లప్ప స్వామి, జూటూరు గురుసిద్ధ నాగసాయి బ్రహ్మ విద్యాశ్రమం పీఠాధిపతి సద్గురు రామానంద స్వామి, ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్‌ప్రభు, లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ మాట్లాడారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలనతో అతిథులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తరిగొండ వెంగమాంబ సేవాసమితి అధ్యక్షులు నీలిమ, సభ్యులు చంద్రమౌళిని, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ తొగట సురేష్‌బాబు కార్యక్రమ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన మేకల మౌలాలి



ప్రమాదానికి కారణమైన ట్రావెల్ బస్సు

ఓర్వకల్లు: జీవాల మేపు కోసం కొడవలిని సానె పట్టించుకునేందుకు వెళ్తూ ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఏపీ గురుకుల పాఠశాల వద్ద సోమవారం చోటుచేసుకొంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన మేకల మౌలాలి(62) అనే వ్యక్తి కొన్నేళ్ల నుంచి గ్రామంలో జీవాలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో సోమవారం జీవాలకు మేపు కోసం ఉపయోగించే కొడవలిని సానె పట్టించుకునేందుకు గ్రామం నుంచి ద్విచక్ర వాహనం మీద సోమయాజులపల్లె గ్రామానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో కాల్వబుగ్గ సమీపంలో గల ఏపీ గురుకుల పాఠశాల ఎదురుగా జాతీయ రహదారిపై మలుపుతిరుగుతున్న క్రమంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్లుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. దీంతో మౌలాలి తీవ్ర గాయాలకు గురయ్యాడు. గాయపడిన వ్యక్తిని కుటుంబ సభ్యులు 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి వెళ్లి ప్రమాద వివరాలను సేకరించారు. మృతుని భార్య జహరాబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ ప్రసాద్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా, మృతుని భార్యతో పాటు, ముగ్గురు కుమారులు సంతానం ఉన్నట్లు తెలిసింది.

నవ బృందావన క్షేత్రంలో సంబరాలు



వసంతోత్సవంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, అర్చకులు

మంత్రాలయం: కర్ణాటకలోని గంగావతి నియోజకవర్గం ఆనెగుంది నవ బృందావన క్షేత్రంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో సంబరాలు చేసుకున్నారు. నవ బృందావన క్షేత్రం విషయంలో ఉత్తరాదిమఠం, మంత్రాలయం మఠం మధ్య బేధాభిప్రాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈనెల 3వ తేదీన కర్ణాటక హైకోర్టు నవ బృందావన క్షేత్రంలో శ్రీమఠానికి పరిమితులు వర్తించవని తీర్పు వెలువరించింది. క్షేత్రంలోని నవ బృందావనాల ఆరాధనోత్సవాలు చేసుకోవడానికి శ్రీమఠానికి అధికారాలు కలిప్తూ ఆదేశాలు రావడంతో శ్రీమఠం పీఠాధిపతి నేతృత్వంలో సంబరాలు చేసుకున్నారు. క్షేత్రంలోని మధ్వమత, శ్రీమఠం పీఠాధిపతులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నకిలీ వైద్యానికి బాలుడు బలి!

- వైద్యం వికటించడంతోనే మృతి
- ఆ వైద్యుడు మనుషులకే కాదు పశువులకు కూడా వైద్యం చేస్తాడు
- చదివింది పదో తరగతి లోపే!

గోనెగండ్ల: కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం గంజిహళ్లి గ్రామంలో నకిలీ వైద్యుడు వేసిన ఇంజెక్షన్ వికటించి అదే గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలుడు రాజేష్ మృతిచెందాడు. ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. రాజేష్‌కు 12 రోజుల క్రితం జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడు బడేసాహెబ్‌ను ఆశ్రయించారు. ఆ వైద్యుడు బాలుడికి ఇంజెక్షన్ వేసిన అనంతరం మూడు రోజులకు ఇంజెక్షన్ వేసిన చోట గడ్డ ఏర్పడింది. ఆ తరువాత గడ్డ నుంచి చీము, రక్తం కారడం తీవ్రం కావడంతో తల్లిదండ్రులు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వారం రోజుల పాటు వైద్యం చేయించినప్పటికీ నయం కాలేదు. పరిస్థితి విషమించి.. బాలుడు శరీరం నుంచి చీము, రక్తం రావడంతో పాటు కండ కూడా ఊడిపోవడం, శరీరంలోని ఇతర భాగాలు కూడా చెడిపోయి ఆదివారం చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. బాలుడికి వైద్యం చేసిన ఆ వైద్యుడు గ్రామంలో పశువులకు కూడా వైద్యం చేస్తాడని ఆ గ్రామంలో చెప్పుకుంటున్నారు. ఆ వైద్యుడు పదో తరగతిలోపే చదివినట్లు గ్రామంలో ప్రచారం ఉంది. గత 20 రోజుల క్రితం ఈ వైద్యుడు వేసిన ఇంజెక్షన్ కారణంగా శరీరంపై గడ్డలు వచ్చి చీము కారి కోలుకోలేక 60 ఏళ్ల నిండిన మరో వ్యక్తి మృతి చెందినట్లు కూడా ఆ గ్రామంలో ప్రచారం జోరుగా సాగుతోంది. బాలుడు మృతి చెందిన విషయమై తల్లిదండ్రులు ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. వైద్యారోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే నకిలీ వైద్యులు రోజురోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

20న జిల్లాస్థాయి యోగా పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 20వ తేదీన జిల్లా స్థాయి యోగా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు నకలు, పాస్‌పోర్టుసైజ్ ఫొటో, పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలని, ప్రవేశరుసుం రూ.30 చెల్లించాలని తెలిపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల్లో కొనసాగుతున్న తనిఖీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఎరువులు, విత్తన, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నాలుగో రోజు సోమవారం కూడా కొనసాగాయి. ఈ నెల 5వ తేదీ నుంచి తనిఖీలు జరుగుతున్న విషయం తెలిసిందే. కృష్ణా జిల్లా గన్నవరం ఏడీఏ శ్రీనివాసరావు, విజిలెన్స్ సీఐ రామకృష్ణ, పల్నాడు జిల్లా క్రోసూరు ఏడీఏ హనుమంతురావు, విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీల్లో ఆయా సబ్ డివిజన్‌ల ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొంటున్నారు. నాలుగో రోజు తనిఖీల్లో భాగంగా రూ.11 లక్షల విలువ కలిగిన 63.53 టన్నుల ఎరువులు, రూ.36 వేల విలువ కలిగిన 13.85 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, రైతులకు తగిన బిల్లులు ఇవ్వకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తుండటం తదితర కారణాలతో అమ్మకాలు నిలిపివేసినట్లు తెలుస్తోంది. నాలుగు రోజుల్లో మొత్తంగా రూ.1.87 కోట్ల విలువ కలిగిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను నిలిపి వేశారు.

మిడుతూరు మండలంలో..

మిడుతూరు: మండలంలో కిసాన్ అగ్రిమాల్, మన గ్రోమోర్ దుకాణాలతోపాటు, చింతలపల్లి, అలగనూరు గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు సుబ్రమణ్యం, సునీల్ కుమార్ బృందం తనిఖీలు చేశారు. రికార్డులుసరిగా లేని కారణంగా కిసాన్ అగ్రిమాల్ దుకాణంలోని రూ 4,46,789 విలువైన ఎరువులు, రూ.4,08,551 విలువైన పురుగు మందుల విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించారు.

డీఈఓకు కడప ఆర్జేడీగా అదనపు బాధ్యతలు



కర్నూలు సిటీ: పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాలయ అధికారిగా పని చేస్తున్న వై.రాఘవరెడ్డిని బదిలీ చేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్యే ఎన్నికల సమయం నుంచే రాఘవరెడ్డిపై తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు తాము చెప్పిన విధంగా వినలేదని, తమకు మద్దతు ఇవ్వలేదనే కారణంతో గతంలో గవర్నర్‌కు ఫిర్యాదులు చేశారు. ఆర్జేడీగా రాఘవరెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత కూడా టీడీపీకి చెందిన ఓ ఎమ్మెల్సీ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పట్టుబట్టి బదిలీ చేయించినట్లు తెలుస్తోంది. దీంతో ఆర్జేడీగా కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న కె.శామ్యూల్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించేందుకు కడప బయలుదేరి వెళ్లారు. కె.శామ్యూల్ గతంలో ఏపీ మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తూ పాల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిగా వ్యవహరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9న కర్నూలు డీఈఓగా బాధ్యతలు స్వీకరించారు.



12న జిల్లాస్థాయి జంప్ రోప్ పోటీలు

కర్నూలు (టౌన్): నందికొట్కూర్ పట్టణంలోని నవనందిని ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో ఈనెల 12వ తేదీన జిల్లాస్థాయి సబ్ జూనియర్ అండర్–12 , అండర్– 14 విభాగాల్లో జంప్ రోప్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జంప్ రోప్ కార్యదర్శి జోసఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27, 28 తేదీల్లో నంద్యాల పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 8790708391 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): భారత వాయుసేనలో అగ్నివీర్–వాయు ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి పీవీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఇంటర్ మీడియట్/డిప్లొమా పూర్తి చేసుకున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 8 నుంచి 28వ తేదీ వరకు https://agnipathvayu. cdac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్, పరీక్ష ఫీజు రూ.550, జీఎస్టీ కలిపి చెల్లించిన వారికి అక్టోబర్ 18వ తేదీ తర్వాత ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష నిర్వహిస్తారని, తదుపరి విద్యార్హత ధ్రువ పత్రాల పరిశీలన తర్వాత శారీరక దారుఢ్య పరీక్షలు జరుపుతారని పేర్కొన్నారు. ఎంపికైన వారిని నాలుగు సంవత్సరాల షార్ట్‌టర్మ్ సర్వీస్ అగ్నివీర్–వాయు సర్వీస్ లోనికి తీసుకుంటారని తెలిపారు.

